క్లుప్తంగా

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు



భీమునిపాడులో కవాతు చేస్తున్న కేంద్రబలగాలు

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సోమవారం కోవెలకుంట్ల మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. భీమునిపాడుతో పాటు కంపమల్ల, బిజనవేముల, కోవెలకుంట్ల పంచాయతీ పరిధిలో సీఐ జయచంద్ర, ఎస్ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల, ఆకుమల్ల గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ దేవిరెడ్డి రామక్రిష్ణ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలని సూచించారు. షాప్‌లో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఇంటింటి ప్రచారం

ప్యాపిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని..ఈ ప్రభుత్వానికే మరో మారు పట్టం కట్టాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం పట్టణంలోని 1,2,16,17,18, వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు.

నేడు కానుకల లెక్కింపు

బనగానపల్లె: యాగంటి క్షేత్రంలోని ఉమా మహేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొట బుచ్చిరెడ్డి సోమవారం తెలిపారు. జనవరి 5వ తేదీ నుంచి ఇప్పటి వరకు భక్తులు వేసిన కానుకలను లెక్కింపు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాల గేటు చోరీ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాల ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడకు ఏర్పాటు చేసిన గేటును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మహాశివరాత్రి నుంచి వరుసగా మూడు రోజులు పాఠశాలకు సెలవులు వచ్చాయి. సోమవారం హెచ్ఎం లక్ష్మీ సంజీవదేవి పాఠశాలకు వచ్చారు. ప్రహరీ గోడకు ఏర్పాటు చేసిన గేటు కనిపించకుండా పోయింది. పాఠశాల ఆవరణలో ఎక్కడైనా పడేశారేమోనని వెతికినా కనిపించలేదు. నాడు-నేడు పథకం కింద పాఠశాల చుట్టూ ప్రహరీని నిర్మించి పటిష్టంగా ఉండేలా గేటు అమర్చారు. జనావాసాల మధ్య ఉన్న పాఠశాలలో గేటును కట్ చూసి తీసుకెళ్లడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ మేరకు హెచ్ఎం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన కోట్ల రామాంజనేయులు జ్ఞాపకార్థం ఆయన భార్య పద్మావతమ్మ, కొడుకులు 14 వార్డు కౌన్సిలర్ కోట్ల మధుసూదన్‌రావు, కోట్ల సురేష్ బాబు రూ.50,016 అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు హుసేన్ రెడ్డి, సుబ్బారెడ్డి, పోలూరు వెంకటేశ్వర్ రెడ్డి దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా గ్రామోత్సవం



డోన్ టౌన్: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం డోన్‌లో కొత్తబుగ్గ శ్రీరామలింగేశ్వరస్వామి, పార్వతిదేవి, గంగాదేవి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి రైలు కిందపడి యువకుడు మృతిచెందాడు. నంద్యాల రైల్వే ఎస్ఐ అబ్దుల్‌జలీల్, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహమ్మద్‌హుస్సేన్ (29) తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా రాత్రి రైలు కిందపడి బలవన్మరణం చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య పాంషాబీ, ముగ్గురు సంతానం ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- రూ.18.50 కోట్లతో జంబులదిన్నె–చెన్నంపల్లె బీటీరోడ్డు పనులకు భూమి పూజ
- టంగుటూరులో సచివాలయం, తాగునీటి ట్యాంకు, సీసీరోడ్లు ప్రారంభం



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: సంక్షేమ పథకాలతో పాటు తాము చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని జంబులదిన్నె గ్రామం వద్ద రూ.18.50 కోట్లతో ఏర్పాటు చేయనున్న బీటి రోడ్డుకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జంబులదిన్నె నుంచి చెన్నంపల్లె వరకు 12 కిలోమీటర్ల మేర అన్నవరం, చిన్నకొట్టాల, వేములపాడు, చెన్నంపల్లె గ్రామాల వరకు ఈ రహదారిని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. రహదారి ఏర్పాటు వల్ల ఈ గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయించి పనులు చేస్తున్నట్లు చెప్పారు. బనగానపల్లె అవుకు మెట్ట నుంచి ఆకుమళ్ల వరకు రూ.18 కోట్లతో ఏర్పాటు చేసిన బీటీ రోడ్డును ఇటీవలే ప్రారంభించినట్లు గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రోడ్డు సౌకర్యం ఉండాలన్నారు. అందుకే గ్రామీణ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు, పాఠశాల నూతన భవనాలు, మరమ్మతులు, అవసరమైన చోట్ల ట్యాంకులు నిర్మించినట్లు తెలిపారు. తాము చేసిన పనులే ఈ ఎన్నికల్లో గెలిపిస్తాయన్నారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీకి మరోసారి మద్దతు తెలిపాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు గోపవరం గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మధు శ్రీను, బాలఒబన్న బాలమద్ది మాజీ సర్పంచ్ గోపాల్, మద్దిలేటిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మునిభాస్కర్‌రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభాలు

మండలంలోని టంగుటూరు గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.35.56 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంకు, రూ.51 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, రూ.10 లక్షలతో నిర్మించిన హార్టీకల్చర్ షెడ్డును ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడం సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి తమను ఆశీర్వదించాలని కోరారు.

టీడీపీ హామీలను నమ్మి మోసపోవద్దు

టీడీపీ నాయకులు మోసపూరిత హామీలతో వస్తారని.. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 2014 ఎన్నికల సమయంలో ఒకసారి మోసపోయారని.. మరోసారి ఆ తప్పు చేయవద్దని కోరారు. 2019 ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి గట్టిగా బుద్ధి చెప్పారని.. 2024లోనూ అది పునావృతం అవుతుందన్నారు. టీడీపీ కూటమికి ఓటు అడిగే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనాగమద్దిలేటి, ఎంపీటీసీ సభ్యురాలు మహానందిరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, గాలిహనుమంతురెడ్డి, లింగాల పెద్దశివారెడ్డి, కానాల నాగేశ్వర రెడ్డి, సుబ్బలక్ష్మీరెడ్డి, హుస్సేన్, జనార్దన్‌రెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరులో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



మాట్లాడుతున్న కాటసాని జయమ్మ

కొలిమిగుండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు, మహిళల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి జయమ్మ, కోడలు మేధాశ్రీరెడ్డి అన్నారు. సోమవారం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. కుటుంబానికి వెన్నుముకగా ఉంటున్న మహిళల పేరిటే సంక్షేమ పథకాలన్నీ అందిస్తున్న ఘటన సీఎం జగన్‌దేనని అన్నారు. మహిళలను బాధపెట్టిన ప్రభుత్వాలు చరిత్రలో ఎక్కడా బాగుపడలేదని, అందుకు ఉదాహరణే గత టీడీపీ ప్రభుత్వమన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిత్యం నియోజకవర్గ అభివృద్ధికి పరితపిస్తుంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. 20 ఏళ్లుగా పొదుపు గ్రూపుల్లో అభివృద్ధి సాధించిన మహిళలను సన్మానించారు. ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ నాగవేణి, ఎంపీటీసీ సభ్యురాలు సుంకమ్మ, కళావతి పాల్గొన్నారు.

నేడు కార్యకర్తలతో సమావేశం

కొలిమిగుండ్ల/సంజామల: ఈనెల 14న బనగానపల్లెలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కొలిమిగుండ్ల, సంజామల మండల కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం కానున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

నాగలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: బుగ్గానిపల్లెలోని బ్రహ్మ సూత్ర సహిత మరకత శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణితో కలిసి ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఆలయ అభివృద్ధికి రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగవెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ మధు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రూప్ దేవాలయాల ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్లు గుండా జగన్, నాగేశ్వర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు సుబ్బన్న, ఘనన్న, బాలస్వామి, నాగమోహన్, రవి శంకర్, నాగరాజు, శేఖర్, ఎల్ల రామయ్య పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి



స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ టౌన్: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ డాక్టర్ జయరాం కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో మేనేజర్ వెంకటేశ్వర్లుని కలిసి వినతి పత్రం అందజేశారు. పాత మున్సిపల్ ఆఫీసు వద్ద ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తుండడం వల్ల కొండపేట నుంచి పాతపేటలో ఉన్న స్కూళ్లు, దేవాలయాలు, మసీదులు, చర్చిలతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ఇక్కడ దారి అవసరమని తెలిపారు. ఈ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అవసరమని పేర్కొన్నారు.

బుగ్గానిపల్లెలో ధోబీఘాట్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నగర పంచాయతీ చైర్మన్, కమిషనర్

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన ధోబీఘాట్‌ను నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు, వైస్ చైర్మన్ నాగవెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ మధు సోమవారం ప్రారంభించారు. ఏళ్లుగా దోబీఘాట్ లేక ఇబ్బందులు పడ్డామని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయడం సంతోషంగా ఉందని రజకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, మద్దయ్య, రామచంద్రుడు, కేశాలు, డక్కిశేఖర్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ప్రీతంరెడ్డి

బేతంచెర్ల: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రీతంరెడ్డి హెచ్చరించారు. సోమవారం బేతంచెర్ల మండలంలోని సమస్యాత్మక గ్రామమైన యంబాయి గ్రామంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యక్రమాలు చేసినా చర్యలు తప్పవన్నారు. ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శివ శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్స్ చంద్రశేఖరప్ప, పీసీలు మద్దిలేటి, గురుబాబు పాల్గొన్నారు.

ఆర్‌బీకే ప్రారంభం




ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

డోన్ రూరల్: మండల పరిధిలోని దేవరబండ గ్రామంలో హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను సోమవారం గ్రామ సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు మహేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సర్వోత్తంరెడ్డి, మధుసుదన్‌రెడ్డి ప్రారంభించారు. రూ.20.80లక్షలతో హెల్త్ సెంటర్, రూ.23.94లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓబులాపురం సర్పంచ్ రమణయాదవ్, నాయకులు గోవింద్‌రెడ్డి, రఘురెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల భాగస్వామ్యంతోనే మసీదు నిర్మాణం



యూ.కొత్తపల్లెలో నిర్మించిన మసీదు



మసీదు వద్ద మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

డోన్/డోన్ రూరల్: మండలంలోని యూ.కొత్తపల్లె గ్రామంలో ముస్లింల సహకారంతోనే మసీదు నిర్మాణం జరిగినట్లు మత పెద్దలు సోమవారం తెలిపారు. గ్రామంలోని ప్రతి ముస్లిం కుటుంబం చేయి చేయి కలపడం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. రూ.70లక్షలతో మసీదు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. మసీదు నిర్మాణం కోసం బయటి వ్యక్తులు, ప్రముఖులు పెద్ద మొత్తంలో విరాళాలు ఇచ్చారనడంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. దుబాయ్‌లో ఉంటున్న మహమ్మద్ నహీమ్ ఖురేషీ రూ.40 లక్షల వరకు విరాళంగా అందజేశారన్నారు. మసీదు నిర్మాణానికి సంబంధించి విరాళాలపై కొన్ని పత్రికలు, చానళ్లలో వస్తున్న వార్తలు వాస్తవం కాదని మతపెద్దలు కొండమీది మాసూం వలీ, లద్దగిరి బికారి, మిన్నెల్ల, మొహీద్దీన్ తెలిపారు.

15న జాబ్ మేళా

డోన్ టౌన్: చిత్తూరు జిల్లా కేంద్రంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేదీ వంద కంపెనీల ప్రతినిధులతో రీజినల్ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీఫార్మసీ, నర్సింగ్, బి.టెక్, పీజీ చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో 15వ తేదీ ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. వివరాలకు స్కిల్‌డెవలప్‌మెంట్ వెబ్‌సైట్ లేదా 9063561786, 9493210966, 8465830771 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

డోన్ ప్రభుత్వ ఐటీఐలో..

డోన్‌లో: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 15వ తేదీ 12 ప్రముఖ బహుళ జాతి కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ కో–ఆర్డినేటర్ నాగవిఘ్నేశ్వర్‌రెడ్డి తెలిపారు. పదో తరగతి ఆపై చదివిన 18 నుంచి 35 ఏళ్ల వయస్కుల వారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని శుక్రవారం ఉదయం 9.30 నుంచి మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని విరాలకు 9542643747, 9573108032, 9440224291 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఆర్థిక సాయం

డోన్ టౌన్: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితునికి డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.20 వేలను అందజేసి ఉదారతను చాటుకున్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో బోయ గరక రాముడుకి చెందిన హోటల్‌లో గత నెల 19వ తేదీ అగ్నిప్రమాదం జరగడంతో సర్వం కోల్పోయాడు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధితుడికి ఆర్థిక సాయం చేశారు.

పూర్ణాహుతితో శివదీక్ష విరమణ



హోమ పూజల్లో ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో శివదీక్ష విరమణ పూర్ణాహుతి కార్యక్రమంతో సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శివపార్వతులకు రుద్రాభిషేకం, కుంకుమార్చన తదతర పూజలు చేశారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పలువురు శివదీక్ష స్వాములు పాతపాడు గ్రామంలోని యాగంటి ముఖ మండపం నుంచి ఇరుముడులు ధరించి, శివనామస్మరణం చేస్తూ పాదయాత్రగా యాగంటి క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయంలో పూర్ణాహుతి పూజల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి శివదీక్షను విరమించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ధ్వజావరోహన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కాటసాని నరసింహారెడ్డి, యాగంటిరెడ్డి, దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. నలుగురి అరెస్టు



పట్టుబడిన మద్యంతో సెబ్ సీఐ

డోన్ రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని స్థానిక సెబ్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బోయ యాగంటి డోన్ రైల్వేస్టేషన్‌లో మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశామన్నారు. నిందితుడి నుంచి 140 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే పట్టణంలోని చిగరుమాన్‌పేటకు చెందిన మౌలాలమ్మ ఇంటి వద్ద నాటు సారా అమ్ముతుండగా అరెస్టు చేసి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్యాపిలి మండలం బావిపల్లి గ్రామానికి చెందిన ఈడిగ సుంకన్న నుంచి 30 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. అలాగే డోన్ పట్టణానికి చెందిన ఈడిగ మల్లికార్జునను అరెస్టు చేసి 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

చేయూతతో మహిళల ఆర్థిక స్వావలంబన

- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు
- మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ



మహిళ గ్రూపులకు చెక్కు అందజేస్తున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థిక స్వాలంబన సాధిస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అన్నారు. స్థానిక షాదీఖానాలో మండల మహిళా సమాఖ్య ఏర్పాటు చేసిన 'వైఎస్సార్ చేయూత.. మారనున్న అక్కా,చెల్లెల్ల భవిత' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని 3,663 మంది సభ్యులకు నాల్గో విడత కింద మంజూరైన రూ.6.86 కోట్ల చెక్కును ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇంటి స్థలాల నుంచి అమ్మఒడి, చేయూత, చేదోడు, తోడు వంటి అనేక పథకాలను మహిళలకే నేరుగా అందజేస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధే రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధికి సూచిక అని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ అన్నారు.

పాలాభిషేకం

మండల సమాఖ్య సభ్యులకు రూ.6.86 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా ఇందుకు సంబంధించిన చెక్కును మహిళా గ్రూపులకు అందజేశారు. అనంతరం మహిళలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ రామాంజనేయులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, కొత్తకోట సర్పంచ్ చంద్రన్న, సీసీలు క్రిష్ణమూర్తి, రవి, ఓబులేసు, సుహాసిని పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- వైస్ ఎంపీపీ చిన్నబాబు
- 180 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ



లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ చిన్నబాబు

సంజామల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైస్ ఎంపీపీ చిన్నబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో రెండో విడత ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నారని తెలిపారు. పేరుసోముల గ్రామాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. గ్రామంలో సుమారు రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు, రూ.36 కోట్లతో వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు లబ్ధి చేకూరిందని వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు మొదటి విడతలో 244 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని.. రెండో విడతలో 180 మందికి పట్టాలు మంజూరైనట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నబి రసూల్, వడ్డె వెంకటేశ్వర్లు, కృష్ణ మూర్తి, నాగరాజు, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో బాలాలయం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేటలో వెలసిన శ్రీకొట్నాల లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం బాలాలయం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో టీటీడీ దృష్టికి తీసుకెళ్లి రూ.6 కోట్లు మంజూరు చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఆలయ ఈఓ బ్రహ్మానంద రెడ్డి, జీర్ణోద్ధరణ కమిటీ చైర్మన్ రవికుమార్, గీత దంపతులు, నూకల వెంకటసుబ్బయ్య, సీహెచ్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా రైతులకు డ్రమ్ములు, టార్పాలిన్లు పంపిణీ



డ్రమ్ములు, టార్పాలిన్లతో ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులు

డోన్: ప్రకృతి వ్యవసాయంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని ఏపీఓ రామాంజనేయులు అన్నారు. సోమవారం జీరో బడ్జెట్ వ్యవసాయం పథకం కింద (జెడ్పీఎస్ఎఫ్) మండలంలోని 300 మంది ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు మంజూరైన డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలను రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అందజేశారు. స్థానిక షాదీఖానాలో జరిగిన కార్యక్రమంలో ఒక్కో మహిళా రైతుకు రెండు టార్పాలిన్లు, రెండు డ్రమ్ముల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, ప్రకృతి వ్యవసాయం సీసీలు లక్ష్మీనారాయణ, రాంమద్దయ్య, రఘురామయ్య, రమాదేవి పాల్గొన్నారు.